క్లుప్తంగా

నేడు మోపిదేవిలో గడప గడపకు మన ప్రభుత్వం

మోపిదేవి: మోపిదేవి గ్రామ సచివాలయం -1లో గురువారం ఉదయం 7 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభమవుతుంది. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గడప గడపను సందర్శించి స్థానికుల సమస్యలు తెలుసుకుంటారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారు.

స్వామి వారి పవళింపు సేవ



పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. బుధవారం రాత్రి స్వామివార్ల పవళింపు సేవ జరిగింది. ఉదయం ప్రత్యేక పూజలు, ఆలయ ద్వాదశ ప్రదక్షిణలు నిర్వహించారు. రాత్రి పుష్పశయ్యాలంకృత పవళింపు సేవతో ఉత్సవాలు ముగిశారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు, అధికారులు చెన్నకేశవ, గుమ్మడి వెంకటేశ్వరరావు, వెంకటరమణ పర్యవేక్షించారు.

తపస్సు కాల దీక్ష ప్రారంభం



అవనిగడ్డ: అవనిగడ్డ శివారు కోటగిరిలంక తిరుకుటుంబ దేవాలయం (ఆర్‌సీఎం చర్చి)లో బుధవారం 104 మంది విశ్వాసులు తపస్సు కాల దీక్ష స్వీకరించారు. ప్రధాన విచారణ గురువు గోట్రు సురేష్‌మెర్లో ప్రత్యేక ప్రార్థనల అనంతరం వీరికి దీక్షను ఇచ్చారు. ఈ సందర్భంగా ఫాదర్ సురేష్‌మెర్లో మాట్లాడుతూ ప్రతిరోజూ ఏసుక్రీస్తుని స్మరిస్తూ బైబిల్ పఠిస్తూ భక్తిభావంతో మెలగాలన్నారు. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం, దాన గుణం కలిగి ఉండటంతో పాటు సమాజానికి ఆదర్శంగా నిలవాలని చెప్పారు. ఆదివారం వరకూ దీక్ష ఇవ్వడం జరుగుతుందని, మార్చి 5వ తేదీ నుంచి 29వ తేదీ వరకు సంఘ పరిధిలోని గ్రామాల్లో నిర్దేశించిన తేదీల్లో నిర్వహించే సిలువ మార్గం కార్యక్రమంలో క్రైస్తవ విశ్వాసులు పాల్గొనాలని కోరారు.

ఆలయ శిఖర ప్రతిష్ఠ



పెదప్రోలు(మోపిదేవి): పెదప్రోలు అద్దంకి నాంచారమ్మ అమ్మవారి నూతన ఆలయంలో శిఖర ప్రతిష్ఠ మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ కార్యదర్శి కూరపాటి కోటేశ్వరరావు దంపతులు, యడ్లపల్లి లక్ష్మణరావు దంపతులచే శిఖర ప్రతిష్ఠ నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఆకుల వెంకట్రామయ్య, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కుర్రా గురుప్రసాద్, మాజీ సర్పంచ్ నాదెళ్ల వెంకట్రామయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ ఆది రాంబాబు, మాజీ అధ్యక్షుడు నాదెళ్ల శరత్ చంద్రప్రసాద్, యడ్ల శ్రీనివాసరావు, జన్యావుల రామమోహనరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చల్లపల్లి: చల్లపల్లి గ్రామ దేవత సంపటాలమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పూజారి చల్లపల్లి కోటేశ్వరరావు అమ్మవారికి విశేష అలంకారం చేయగా, అర్చకులు ఘంటసాల శతానందశాస్త్రి ప్రత్యేక పూజలు చేశారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని సామూహిక కుంకుమ పూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహా చండీయాగానికి ముమ్మర ఏర్పాట్లు

కోడూరు: కోడూరు గంగాభవానీ అమ్మవారి ఆలయం వద్ద ఈ నెల 27న నిర్వహించనున్న మహా చండియాగానికి ఆలయ కమిటీ ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఆలయాన్ని పునర్నిర్మించి 11 సంవత్సరాలు పూర్తికావడంతో ఈనెల 26న చిన్న అమ్మవారికి కలశపూజలు, సంప్రోక్షణ, 27న నాలుగు హోమ గుండాల ద్వారా 16 మంది దంపతులతో మహా చండీ యాగం నిర్వహిస్తామని చెప్పారు. మహా పూర్ణాహుతి అనంతరం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశామని వివరించారు.

గృహాలు వెంటనే నిర్మించుకోండి

గుడ్లవల్లేరు: జగనన్న కాలనీలో గృహాలు వెంటనే నిర్మించుకోవాలని ఎంపీడీఓ డి.శ్రీనివాస్ పేర్కొన్నారు. కౌతవరంలో మహిళా గృహ లబ్ధిదారులకు ఆయన బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు ప్రభుత్వం కల్పించే ఆర్థికసాయంతో పాటు స్టీలు, సిమెంట్ ఉపయోగాలను విశదీకరించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లమూడి చిన్ని, కార్యదర్శి సీహెచ్.ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ క్రాంతి పథం కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు రజియా, హేమంత్ పాల్గొన్నారు.

సత్యసాయి సేవ.. ఉపాధి తోవ

- కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్‌లో తర్ఫీదు
- శిక్షణ పొందిన 24 మంది మహిళలు
- మార్చిలో రెండో బ్యాచ్ శిక్షణకు ఏర్పాట్లు



టైలరింగ్‌లో నిమగ్నమైన మహిళలు

మచిలీపట్నంటౌన్: మహిళల ఉపాధికి సత్య సాయి సేవా సమితి బాటలు వేస్తోంది. నగరంలోని బస్టాండ్ వెనుక ఈడేపల్లిలోని సేవా సమితి మందిరంలో మహిళలకు ఉచిత కుట్టు, ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించింది. సంస్థ ఆధ్వర్యంలో మహిళాభివృద్ధికి తోడ్పాటును అందించాలనే ఉద్దేశంతో సేవా సమితి నిర్వాహకులు గత 72 రోజులుగా పేద మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ ముగించుకున్న మహిళలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. సత్యసాయి ఉపాధి శిక్షణ కేంద్రంలో డిసెంబర్‌లో ప్రారంభమైన ఉచిత శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది.

ఎస్. నాగమణి 24 మంది పేద మహిళలకు టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఇన్‌చార్జి నాగప్రసాద్, సేవా సంస్థ జిల్లా అధ్యక్షుడు కొమరగిరి చంద్రశేఖర్, స్థానిక సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ పర్యవేక్షణలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సత్యసాయిబాబా 100వ జన్మదినోత్సవాల్లో భాగంగా పేద మహిళలకు ఉపాధికి మార్గం చూపాలనే ఉద్దేశంతో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పలు డిజైన్లలో నైపుణ్యం..

శిక్షణలో నూతన విధానాలను నేర్చుకున్నారు. జాకెట్లు, పంజాబీ డ్రెస్సులు, గౌన్లు తదితర దుస్తులు కుట్టడంలో నైపుణ్యంలో సాధించారు. దుస్తులను పలు మోడల్స్‌లో, డిజైన్లలో ఆకర్షణీయంగా తీర్చిదిద్దడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. శిక్షణ పొందిన మహిళలకు నేర్చుకున్న పని ఉపాధికి ఎంతగానో దోహదపడనుంది.

తక్కువ కాలంలో ఎక్కువ నేర్చుకున్నాం



సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో 72 రోజుల పాటు టైలరింగ్‌లో శిక్షణ పొందాం. తక్కువ కాలంలో ఎక్కువ నేర్చుకున్నాను. బ్లౌజ్, ఫ్రాక్, ఇతర డ్రెస్సులు తయారు చేయటంతో పాటు మోడల్స్ నేర్చుకున్నాం.

– ఎల్.శివపార్వతి, మాచవరం

టైలరింగ్‌తోనే జీవనం



నేర్చుకున్న టైలరింగ్ ద్వారా జీవనాన్ని సాగిస్తాను. కుట్టు మిషన్‌పై ఇంటి వద్ద పనిచేసి ఉపాధి పొందుతాను. తక్కువ రోజుల్లో శిక్షకురాలు నాగమణి తనకు ఎంతగానో పని నేర్పారు. నేర్చుకున్న పనిని మరింత మెరుగుపరిచి ఉపయోగించుకుంటాను.

– వాకా శాంతకుమారి, కేశవరావుతోట

మార్చి నుంచి రెండో బ్యాచ్‌కు శిక్షణ



మార్చి నెలలో రెండో బ్యాచ్ శిక్షణ కార్యక్రమం ప్రారంభిస్తాం. ఇప్పటికే 15 మంది పేర్లు నమోదు చేసుకున్నాం. తమ సంస్థలో 14 కుట్టుమిషన్లు ఉన్నాయి. 28 మంది శిక్షణ పొందే అవకాశం ఉంది.

– పోతుకూచి ఆంజనేయకుమార్, సమితి కన్వీనర్

కష్ట సుఖాల్లో తోడుగా ఉంటున్నది జగనన్నే

గడప గడపకు మన ప్రభుత్వంలో పేర్ని కిట్టుతో వృద్ధులు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న పేర్ని కిట్టు

మచిలీపట్నంటౌన్: తమ కుటుంబ సభ్యుడిలా కష్ట సుఖాల్లో తోడుగా ఉంటున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటామని పలువురు వృద్ధులు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం 24వ డివిజన్‌లో నిర్వహించారు. కార్పొరేటర్ చిత్తజల్లు ప్రసన్న, డివిజన్ ఇన్‌చార్జి చిత్తజల్లు రాజుతో కలిసి పేర్ని కిట్టు గడప గడపకు వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

తన కుమారుడు శ్రీనివాసరావు కిడ్నీ వ్యాధితో బాధ పడుతుంటే మీ తండ్రి పేర్ని నాని చొరవ చూపి విజయవాడలో శస్త్రచికిత్స చేయించాడని, మీ మేలు ఎన్నటికీ మరిచిపోలేమని ఆ ప్రాంతానికి చెందిన వృద్ధురాలు వెంపటపు సరోజిని పేర్ని కిట్టుకు తెలిపింది. ఆ ప్రాంతంలోని సర్కిల్‌పేట–1 అంగన్‌వాడీ కేంద్రాన్ని పేర్ని కిట్టు పరిశీలించి చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. కార్పొరేటర్ మాచవరపు రాంప్రసాద్, వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జీలు బూరగ రామారావు, గూడవల్లి నాగరాజు, నాగేశ్వరస్వామి ఆలయ చైర్మన్ ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి: 12 మంది అరెస్ట్

గూడూరు: గూడూరు మండలం నగరం గ్రామంలో కోడి పందేలపై గూడూరు పోలీసులు బుధవారం దాడి చేశారు. 12 మందిని అరెస్ట్‌చేశారు. వారి నుంచి రూ.7,070 నగదు, 13 ద్విచక్ర వాహనాలు, రెండు పందెం పుంజులను స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ పి. జాషువా ఆదేశాల మేరకు బందరు డీఎస్పీ మాసుం బాషా ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో గూడూరు ఎస్ఐ వి.వెంకటేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

లార్డ్ బాడెన్ పావెల్ దంపతులకు నివాళి



గూడూరు: ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని గూడూరు జిల్లా పరిషత్ హై స్కూల్లో బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని డి. పుష్పలత మాట్లాడుతూ స్కౌట్ ఉద్యమాన్ని స్థాపించిన లార్డ్ బాడెన్ పావెల్, అతని భార్య లేడీ ఒలీవ్ బాడెన్ పావెల్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రపంచవ్యాప్తంగా ఆలోచన దినోత్సవం నిర్వహిస్తారని వివరించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దివ్యాంగ విద్యార్థులకు భోజనం

బంటుమిల్లి: బంటుమిల్లిలోని భవిత కేంద్రంలో దివ్యాంగులైన విద్యార్థులకు సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా బిర్యానీ వడ్డించారు. కార్యక్రమంలో బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాలకు చెందిన కో–ఆర్డినేటర్లు ముస్తాన్‌బేగ్, పుప్పాల నాగబాబు, ఉపాధ్యాయులు రాజు, భగవతి పాల్గొన్నారు.

105 మందికి నేత్ర వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

మచిలీపట్నంటౌన్: వాసవీ క్లబ్, వాసవీ కపుల్స్ క్లబ్, వాసవీ వనిత క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక కోతి సెంటర్‌లోని కొల్లిపర కల్యాణ మండపంలో ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ఎల్‌వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన వైద్యులు భవానీ, ప్రశాంత్ హాజరై 105 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 45 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి వారికి తేదీలను ఖరారు చేశారు. ఆర్యవైశ్య సంఘ నాయకుడు గుడివాడ గున్నయ్యశెట్టి ప్రారంభించారు. క్లబ్‌ల ప్రతినిధులు పర్యవేక్షించారు.

పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో....

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘ భవనంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. రాజమండ్రికి చెందిన గౌతమీ నేత్రాలయం వైద్యులు కర్రి తిరుపతి 22 మందికి పరీక్షలు నిర్వహించి నలుగురికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు. శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు రోగులను రాజమండ్రి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షులు కారుమూరి రాజేంద్రప్రసాద్, సంఘ కోశాధికారి శంకరరావు పాల్గొన్నారు.

మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు ఆదర్శం



అవనిగడ్డ పార్టీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

అవనిగడ్డ: విద్యారంగంలో ఎన్నో సంస్కరణలు తెచ్చిన మాజీ కేంద్రమంత్రి దివంగత మౌలానా అబుల్ కలాం ఆజాద్ సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వరరావు, మండల కో–ఆప్షన్ సభ్యులు షేక్ నజీర్‌లు ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తొలి విద్యా శాఖా మంత్రిగా ఆజాద్ దేశానికి అందించిన సేవలను కొనియాడారు. ఎంపీటీసీ గణేష్, ఉప సర్పంచ్ కోడూరు సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు నలుకుర్తి పృథ్వీరాజ్, సైకం బాబూరావు, నాయకులు, ముస్లింలు పాల్గొన్నారు.

బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం హర్షణీయం



విలేకరులతో మాట్లాడుతున్న గొర్ల, బీసీ సంఘాల నాయకులు

గుడివాడరూరల్: ఎమ్మెల్సీ స్థానాల్లో బీసీలకు అధికంగా కేటాయించి మరోమారు బీసీలపై ఉన్న ప్రేమను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చాటుకున్నారని వైఎస్సార్ సీపీ బీసీ సంఘ నాయకులు పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బీసీలపై తనకున్న అభిమానాన్ని ఎమ్మెల్సీ ఎన్నికల్లో 18 సీట్లకుగాను 11బీసీలకు కేటాయించి అభిమానాన్ని చాటారన్నారు. బీసీలను ఓటు బ్యాంక్‌గా వాడుకున్న చంద్రబాబు వారికి ఎప్పుడు ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సైతం నియోజకవర్గంలో పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులను సైతం బీసీలకు ఇచ్చి వారికి సముచితమైన గౌరవాన్ని ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి అన్ని రకాల పదవులను కట్టబెట్టారన్నారు. రాజ్యసభతో పాటు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సీట్లను ఎక్కువగా బీసీలకే ఇచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. బీసీలు ముఖ్యమంత్రి రుణం తీర్చుకోవాలంటే మరోమారు ఆయన్ను సీఎం సీట్లో కూర్చోబెట్టాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి బీసీలు మద్దతు పలికి సీఎం రుణం తీర్చుకోవాలన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ తోట నాగరాజు, గుంటాకోడూరు ఎంపీటీసీ అంగడాల శ్రీరామాంజనేయులు, నందివాడ మండల వైస్ ఎంపీపీ పూడి సుధాకర్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

25న మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు

మండవల్లి: మండలంలోని ఒక గ్రామంలో మినుము కొనుగోలు కేంద్రం ఈ నెల 25న ఏర్పాటు చేయనున్నట్లు ఏఓ షేక్ జరీనా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్వింటాల్ ధర రూ.6,600 చెల్లిస్తారని, ఈ–క్రాప్, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని తెలిపారు.

కారుమూరి కిశోర్‌కి డాక్టరేట్



అవనిగడ్డ: అవనిగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తు కారుమూరి కిశోర్ అర్థశాస్త్రంలో డాక్టరేట్ తీసుకున్నారు. ఆధార్ అనుసంధానంతో రేషన్ సరుకుల పంపిణీ వల్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సామాజిక, ఆర్థిక అంశాలపై ప్రభావం అంశంపై కృష్ణా జిల్లా సర్వే ఆధారంగా ఆయన పరిశోధనలు చేశారు. డాక్టర్ రాజశేఖర్ వద్ద పరిశోధనలు చేసిన కిశోర్ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఐనపూరుకు చెందిన కిశోర్ డాక్టరేట్ అందుకోవడంతో తోటి అధ్యాపకులు ఆయనను అభినందించారు.

సచివాలయ ఉద్యోగులు ఇద్దరికి మెమోలు

పెడన: పెడన మండలంలోని వివిధ సచివాలయాల్లో పనిచేస్తున్న ఇద్దరు వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు ఇన్‌చార్జి ఎంపీడీఓ బి. సుబ్బారావు బుధవారం మెమోలు జారీ చేశారు. కొంకెపూడి గ్రామ సచివాలయం వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ తోపుల దినేష్, గురువిందగుంట గ్రామ సచివాలయ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ లూథియాబాయి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉండటమే కాకుండా సక్రమంగా హాజరు కాకపోవడం పై సంజాయిషీ కోరుతూ మెమోలు జారీచేశామని ఎంపీడీఓ చెప్పారు.

మంత్రి జోగి రమేష్‌ను కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి

కైకలూరు: ఎమ్మెల్సీ అభ్యర్థి జయమంగళ వెంకటరమణ ముదినేపల్లిలో జరిగిన ఓ కార్యక్రమానికి విచ్చేసిన రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ విషయాలపై కొద్ది సమయం ముచ్చటించుకున్నారు. అదేవిధంగా జయమంగళ నివాసం వద్ద కలిదిండి మండలం పెదలంకలో జరిగే పెద్దింట్లమ్మవారి 54వ వార్షిక మహోత్సవాల పోస్టర్‌ను నిర్వాహకులతో కలిసి విడుదల చేశారు.

5న వార్షిక కల్యాణ మహోత్సవం

కూచిపూడి(మొవ్వ): కూచిపూడిలోని శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి వార్ల 260వ వార్షిక కల్యాణ మహోత్సవాన్ని మార్చి 5వ తేదీన నిర్వహిస్తామని దేవాలయ ధర్మకర్తల మండలి సభ్యులు ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. బ్రహ్మశ్రీ రాళ్లపల్లి ఆంజనేయ శాస్త్రి పర్యవేక్షణలో మార్చి రెండు నుంచి 8వ తేదీ వరకు కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. 2, 3 తేదీల్లో అమ్మవారిని, అయ్యవారిని పెండ్లి కొడుకులుగా చేయటం, 4న గ్రామోత్సవం, 5వ తేదీ రాత్రి 11 గంటలకు శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారి, శ్రీ రామలింగేశ్వర స్వామి కల్యాణ బ్రహ్మోత్సవం, 6వ తేదీ 11.30కి కల్యాణ అన్నప్రసాద వితరణ, రాత్రి 9 గంటలకు రథోత్సవం, 7న వసంతోత్సవం, శేష వాహనంపై గ్రామోత్సవం, 8న పవళింపు సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల కృషి అభినందనీయం

మంత్రి జోగి రమేష్



ముఖద్వారాన్ని ప్రారంభించి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: ముక్కొల్లులోని మహంకాళమ్మ తల్లి ఆలయ అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. గ్రామస్తులు సమ్మెట వేణుగోపాలరావు, సమ్మెట శ్రీనివాసరావు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించిన మహంకాళమ్మ తల్లి ఆలయ ముఖద్వారం, చందన రాంబాబు, శాంతకుమారి దంపతులు రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన పాలపొంగళ్ల మండపాలను మంత్రి జోగి రమేష్ బుధవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ అమ్మ వారి ఆలయాభివృద్ధికి దాతల సేవలు ఎనలేనివని కొనియాడారు. దాతలకు అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయన్నారు. ఎంపీపీ సంగా మధుసూదనరావు, జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు, కేడీసీసీబీ మాజీ డైరెక్టర్లు అంబటి కాంతారావు, సమ్మెట సత్యం, సర్పంచులు గుడివాడ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఆర్బీకే చైర్మన్ సమ్మెట రాఘవ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు జక్కా ధర్మారాయుడు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఉపాధి పనులు కల్పించాలి

డ్వామా పీడీ సూర్యనారాయణ



కూలీలతో మాట్లాడుతున్న పీడీ సూర్యనారాయణ

కోడూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి తప్పనిసరిగా వంద రోజుల పనిని కల్పించేందుకు పథకం అధికారులు చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ సూర్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని పోటుమీద, స్వతంత్రపురం జగనన్న లేఅవుట్లలో పథకం కింద జరుగుతున్న పనులను ఆకస్మికంగా పరిశీలించారు. పథకం ఆధ్వర్యంలో లేఅవుట్లలో రహదారుల నిర్మాణాలతో పాటు మొక్కలు నాటినట్లు పీడీ తెలిపారు. వేసవి సమీపిస్తుండటంతో ప్రజలు వలసబాట పట్టకుండా గ్రామంలోనే పనిని కల్పించేందుకు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. పంటబోదెల తవ్వకాలు, కాలువల లెవలింగ్, రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటడం తదితర పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పీడీ ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెట్ట భూమి రైతులకు పంటసాగులో సబ్సిడీ..

మెట్ట భూమి ఉన్న రైతులకు హార్టికల్చర్ కింద పంట సాగులో సబ్సిడీ అందిస్తున్నామని పీడీ తెలిపారు. ఆసక్తి ఉన్న రైతులు తమ భూమి వివరాలతో స్థానిక కార్యాలయాల్లో సంప్రదించవచ్చన్నారు. జగనన్న లేఅవుట్లలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు. అనంతరం కూలీలతో మాట్లాడారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగరేవతి, ఏపీఓ రాజ్‌కుమార్, పథకం సిబ్బంది పాల్గొన్నారు.

నెరవేరిన రహదారి హామీ



నూతనంగా నిర్మించిన సీసీ రహదారి

కోడూరు: గడప గడపకు మన ప్రభుత్వం సమయంలో ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు గ్రామస్తులకు ఇచ్చిన హామీని నెరవేర్చారు. మండలంలోని లింగారెడ్డిపాలెం శివారు జరుగువానిపాలెం గ్రామంలో గత ఏడాది జులై 3వ తేదీన ఎమ్మెల్యే స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆ సమయంలో పలువురు గ్రామస్తులు తమ రహదారి బాగోలేదని, వర్షం వస్తే బురదకయ్యగా మారి నడవడానికి కూడా వీలు లేకుండా మారిందని ఎమ్మెల్యే వద్ద వాపోయారు. రమేష్‌బాబు రహదారి నిర్మాణం చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటను నెరవేరుస్తూ గ్రామస్తుల అభ్యర్థన మేరకు ఎంపీ లాడ్స్ నుంచి రూ.5 లక్షల ప్రత్యేక నిధులతో సీసీ రోడ్డు నిర్మించారు. పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 84 మీటర్ల మేర ఈ రహదారి నిర్మాణం చేపట్టారు. ఎమ్మెల్యే తమ సమస్యను వెంటనే పరిష్కరించి తమకు రహదారి సౌకర్యం కల్పించడం చాలా ఆనందంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మూడు రోజులే గడువు

ఈ–పంట నమోదుతో ప్రభుత్వ ప్రయోజనాలు



ఈ–పంట నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ సహాయకులు

గూడూరు: ఈ–పంట నమోదుకు ఈనెల 25వ తేదీ వరకు మాత్రమే గడువు ఉంది. గూడూరు గూడూరు మండలానికి సంబంధించి ఇప్పటి వరకు ఈ–పంట నమోదు ప్రక్రియ 79 శాతం పూర్తయింది. మండలంలో 17,751 ఎకరాల్లో పంట సాగవుతుండగా ఇప్పటివరకు 13,514 ఎకరాలలో ఈ–పంట నమోదు ప్రక్రియ పూర్తయింది. ఇంకా 3,657 ఎకరాలలో ఈ–పంట నమోదు చేయాల్సి ఉంది. రైతులు త్వరితగతిన వీఏఏలను సంప్రదించి ఈ–పంట నమోదు చేయించుకుంటే ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలు పొందవచ్చు.

నమోదు ఇలా..

ఈ–పంట నమోదు ప్రక్రియ రైతు భరోసా కేంద్రంలోని గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా జరుగుతుంది. ముందుగా ఆర్బీకేలలో వీఏఏలు రైతుల వివరాలు నమోదు చేస్తారు. క్షేత్రసాయికి వెళ్లి పంట నమోదు చేసుకుంటారు. చివరగా రైతు ఈకేవైసీ నమోదు చేయాల్సి ఉంటుంది. రైతులు ఈ–పంట నమోదు చేయించుకోవడం ఎంత ముఖ్యమో ఆధార్ అనుసంధానం చేయించుకోవడం కూడా అంతే ముఖ్యం.

ప్రయోజనాలు ఇవి..

రైతులు పంట నమోదు చేసుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ప్రభుత్వం కల్పిస్తుంది. పెట్టుబడి సాయం అందించడం, పంటలకు బీమా చేయడం, ప్రకృతి వైపరీత్యాల సమయంలో నష్టపరిహారం అందించడం, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందులు రైతు భరోసా కేంద్రాల ద్వారా సమకూర్చడం వంటి ప్రయోజనాలు ప్రభుత్వం కల్పిస్తోంది. ప్రభుత్వం అందించే ఇలాంటి ప్రయోజనాలు పొందాలంటే రైతులు తప్పనిసరిగా ఈ–పంట నమోదు చేసుకోవాలి.